మహనీయుల చరిత్ర యువతకు స్ఫూర్తిదాయకం

- ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు
- వెడ్మ రాముకు ఘన నివాళి

వెడ్మ రాము విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, తదితరులు

తిర్యాణి, అక్టోబర్ 26: మహనీయుల చరిత్ర యువతకు స్ఫూర్తిదాయకమని ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు అన్నారు. మండలంలోని ఏదులపాడ్ గ్రామంలో శనివారం నిర్వహించిన వెడ్మ రాము వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలతో పాటు డీటీడీవో రమాదేవి, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్ హాజరయ్యారు. అంతకు ముందు వారి సంప్రదాయం ప్రకారం జెండాను ఆవిష్కరించారు. రాము సమాధి వద్ద సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ, కుమ్రం భీం, కుమ్రం సూరు, రాంజీగోండ్, వెడ్మ రాము పోరాటాలు, ఆశయాలు, త్యాగాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి ఆశయాలు నెరవేర్చాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్నారు. ప్రతి సంవత్సరం వారి వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆదివాసుల కళలు, సంస్కృతీసంప్రదాయాలను దేశవ్యాప్తంగా పరిచయం చేసిన వ్యక్తి రాము అని కొనియాడారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, ఏదులపాడ్ గ్రామంలో వెడ్మ రాము నిలువెత్తు విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేయడంతో పాటు వర్ధంతి కార్యక్రమం అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఏటీడీవో చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సుకోల సరస్వతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హన్మాండ్ల జగదీశ్, ఆదివాసీ సంఘాల నాయకులు ఆత్రం సంతోష్, సహకటి దస్రు, మడావి గుణవంతరావు, దశరత్, కుర్సింగ బాధిరావు, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

తానిమడుగు అడవుల్లో వనమేధం

దండేపల్లి, అక్టోబర్ 26: కవ్వాల్ పులుల అభయారణ్యంలో వనమేధం జోరుగా సాగుతున్నది. తాళ్లపేట రేంజ్ పరిధిలోని తానిమడుగు బీట్‌లో 24 టేకు చెట్లను నరికిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అడవుల్లోని భారీ వృక్షాలను స్మగ్లర్లు నేలకూల్చి యథేచ్ఛగా తరలిస్తున్నారు. తానిమడుగు బీట్‌లో అక్రమంగా టేకు చెట్లను నరికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తానిమడుగు అడవుల్లోకి వెళ్లి తనిఖీలు చేపట్టారు. సుమారు 24 చెట్లను నరికివేసినట్లుగా అధికారులు గుర్తించారు. ఈ విషయమై మంచిర్యాల ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజర్ రమాదేవిని వివరణ కోరగా తానిమడుగు అడవుల్లో టేకు చెట్ల నరివేత వాస్తవమేనన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపినట్లు తెలిపారు. 24 టేకు చెట్లు నరికివేతకు గురైనట్లు గుర్తించామన్నారు. తదుపరి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

నరికిన చెట్ల వివరాలు సేకరిస్తున్న అధికారులు

సీఐ స్వామికి పూల మొక్క అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సీఐని కలిసిన నాయకులు

రెబ్బెన, అక్టోబర్ 26: రెబ్బెన సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బుద్దె స్వామిని శనివారం సాయంత్రం ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ సభ్యుడు సంగెం ప్రకాశ్‌రావు, మాజీ జడ్పీటీసీ సాలిగామ బానయ్య, గోలేటి పట్టణాధ్యక్షుడు లావుడ్య పల్లాస్, ఏరియా కార్యదర్శి చంద్రకుమార్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, తదితరులున్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 26: ఫిల్టర్ బెడ్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 28న (సోమవారం) మంచిర్యాల పట్టణంలోని 36 వార్డులకు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ధర్మయుద్ధ సభను విజయవంతం చేయాలి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 26: జన్నారంలో ఈనెల 27న నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ సభకు మాదిగ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ మంచిర్యాల నియోజకవర్గ కన్వీనర్ చుంచు శంకర్‌వర్మ, నాయకులు గద్దల బానయ్య, గొడిసెల దశరథం శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు.

సల్పాలవాగుకు వెళ్తున్న చింతగూడెం ఆదివాసీ గిరిజనులు

నేడు ఆదివాసీ దండారీ దర్బార్

కాసిపేట, అక్టోబర్ 26: కాసిపేట మండలంలోని సల్పాలవాగు సమీపంలో గల వెంకటాద్రి గుడిలో ఆదివారం ఘనంగా నిర్వహించే ఆదివాసీ దండారీ దర్బార్‌కు ఆదివాసీలు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా, శనివారం రాత్రి నుంచే మండలంలోని ఆయా గ్రామాల నుంచి దండారీలు కుటుంబసభ్యులతో కలిసి తరలివెళ్లారు.

ఆర్డీవోకు వినతి

బెల్లంపల్లి, అక్టోబర్ 26: ధార్మిక సంస్థ ముసుగులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, అనుమతి లేకుండా బ్రిడ్జి నిర్మించారని శనివారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

మందమర్రి రూరల్, అక్టోబర్ 26: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నేతృత్వంలో చేపట్టిన మాలల మహా పాదయాత్రను జయప్రదం చేయాలని మాల మహానాడు సంఘం మండలాధ్యక్షుడు ఈద లింగయ్య పిలుపునిచ్చారు. మండలంలోని శంకరపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాజన్న, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజన్న, కోశాధికారి శంకర్, నాయకులు పోశం, కిరణ్, నర్సయ్య, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్టాప్ బోర్డు ఏర్పాటు

చెన్నూర్, అక్టోబర్ 26: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నేతృత్వంలోని బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణ సమీపంలోని గోదావరి రోడ్డు చౌరస్తాలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ శనివారం ప్రయాణికుల సౌకర్యార్థం రిక్వెస్ట్ బస్టాప్ బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని సతీశ్, బజ్జూరి కమల, తిరుపతి, సురేశ్, ఎనగందుల ప్రశాంత్, మేకల వెంకటేశ్, రాగం సాయిలు పాల్గొన్నారు.

ఉత్తమ పైలెట్‌గా కోటపల్లి ఈఎంటీ ఎంపిక

కోటపల్లి, అక్టోబర్ 26: 108 అంబులెన్స్ సర్వీస్ హాస్పిటల్ కేర్‌లో మెరుగైన సేవలందించిన కోటపల్లి ఈఎంటీ శహబాజ్‌ను మంచిర్యాల జిల్లా ఉత్తమ పైలెట్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కార్యనిర్వహణాధికారులు సంపత్, సతీశ్, 108 శిక్షణ అధికారి గజేందర్ అవార్డ్ ప్రదానం చేశారు.

జేఎంఈటీలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 26: సింగరేణిలో జేఎంఈటీలుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఓవర్‌మెన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని శనివారం డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన

కోటపల్లి, అక్టోబర్ 26: కరీంనగర్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సంఘం మంచిర్యాల జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ కోరారు. కోటపల్లి మోడల్ స్కూల్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలలో ఓటు నమోదుపై శనివారం ఆయన ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి కోమట్ల బాపు, బిల్ల తిరుపతి, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, అక్టోబర్ 26: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాలో పీఆర్టీయూటీఎస్ నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి, మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి, ఎలక్షన్ కోఆర్డినేటర్ తనుకు నాగేశ్వరరావు, జిల్లా నాయకులు అన్నం రమణారెడ్డి, పల్లె కృష్ణ గోపాల్ రావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

కాసిపేట, అక్టోబర్ 26: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మామిడిపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 26: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి అనిత రైతులకు సూచించారు. కన్నాల రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ బెల్లంపలి ఏడీ రాజనరేందర్, క్లస్టర్ ఉద్యానవన అధికారి అర్చన, వ్యవసాయాధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ప్రభాకర్, అరుణ్, రాము, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

కౌటాల, అక్టోబర్ 26: మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎంఈవో హన్మంతు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ మేనేజర్ జెన్నీఫర్, పీజీ హెచ్ఎంలు నానాజీ, నారాయణ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

కాగజ్‌నగర్, అక్టోబర్ 26: పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో శనివారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జెండాను సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) జిల్లా కార్యదర్శి ఎమ్మాజీ సతీశ్‌కుమార్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, కంపెనీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి, నాయకులు ప్రవీణ్, ప్రదీప్, రాంచందర్, బుచ్చిబాబు, నర్సింగరావు, రామకృష్ణ, ఆన్ మ్యాన్డ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వర్షవాస్ కార్యక్రమం

సిర్పూర్(టీ), అక్టోబర్ 26: మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మూడు నెలల పాటు కొనసాగిన వర్షవాస్ కార్యక్రమం ముగింపు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ భవన్ నుంచి బస్టాండ్ వరకు శాంతియుత ర్యాలీ తీశారు. బౌద్ధ సమాజ్ సంఘం మండలాధ్యక్షుడు రాజు, విక్రమ్, తులసీరామ్, తిరుపతి, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నజ్రుల్‌నగర్‌లో నెలకొన్న వివాదం

కాగజ్‌నగర్, అక్టోబర్ 26: కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి వివాదం జరిగింది. నజ్రుల్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి అర్ధరాత్రి ఓ వర్గానికి చెందిన యువకుడు వెళ్లడంతో కొందరు యువకులు పట్టుకొని చితబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి యువకుడిని కాపాడే ప్రయత్నంలో పోలీసులకు గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘటనలో పోలీసులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో అంత ప్రశాంత వాతావరణం నెలకొన్నదని పోలీసు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయం సందర్శన

కాగజ్‌నగర్, అక్టోబర్ 26: మండలంలోని గన్నారంలో గల మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయాన్ని ఆర్ఎల్‌సీ గోపీచంద్ శనివారం సందర్శించారు. విద్యాలయంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితం అదృశ్యమైన విద్యార్థిని వివరాలు సేకరించారు. అదృశ్యమైన విద్యార్థిని ఆదిలాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడి నుంచి విద్యాలయానికి తీసుకొచ్చినట్లు ప్రిన్సిపాల్ సుశ్మీత తెలిపారు.

విశ్రాంత కార్మికులకు బెనిఫిట్స్ అందించాలి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 26: సింగరేణిలో విశ్రాంత కార్మికులకు బెనిఫిట్స్ త్వరగా చెల్లించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్ శనివారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. సింగరేణి కార్మికులు, అధికారులకు లాభాల్లో వాటా, దీపావళి బోనస్ యాజమాన్యం చెల్లించిందని, విశ్రాంత ఉద్యోగులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడంలో జాప్యం చేయడం సరికాదన్నారు.

అలరించిన స్వాగతోత్సవం

హాజీపూర్, అక్టోబర్ 26: వేంపల్లి గ్రామ శివారులోని మంచిర్యాల గార్డెన్‌లో శ్రీహర్ష డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శనివారం స్వాగతోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా సంస్థల చైర్మన్ పల్లె భూమేశ్ హాజరై మాట్లాడారు. ఈ విద్యా సంస్థలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో ఉద్యోగాలను సాధించారన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పోటు మనోహర్ రెడ్డి, అనితా ఠాకూర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సీఐ

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 26: చెన్నూర్‌లో మతిస్థిమితం లేని మహిళను సీఐ రవీందర్ మంచిర్యాలలోని కల్వరి యువశక్తి అనాథాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు. సీఐని పట్టణ ప్రజలు అభినందించారు.

స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కాసిపేట, అక్టోబర్ 26: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాసిపేటలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షిత్, నవీన్, రాజేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కాసిపేట, అక్టోబర్ 26: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు ప్రశాంత్, రూపక్ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

8, 9న సీపీఎం జిల్లా మహాసభలు

బెల్లంపల్లి, అక్టోబర్ 26 : మంచిర్యాలలో నవంబర్ 8, 9వ తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పైలా ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గొమాస అశోక్, దాగం రాజారం, చల్లూరి దేవదాస్, దుర్గం సజీవన్, దాగం శ్రీకాంత్, రాములు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట పలువురి బైండోవర్

దండేపల్లి, అక్టోబర్ 26: తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలో అక్రమంగా కలప నిల్వ చేసిన వారితో పాటు పోడు వ్యవసాయం కోసం అటవీ భూమిలో చెట్ల కొమ్మలు నరికేసిన వారిని, అక్రమంగా టేకు చెట్లను నరికేసిన పలువురిని తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు డీఆర్వో పోచమల్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నరేశ్, ఎఫ్‌బీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐని కలిసిన ఎంఐఎం నాయకులు

కాగజ్‌నగర్, అక్టోబర్ 26: కాగజ్‌నగర్ పట్టణ సీఐ పల్నాటి రాజేంద్రప్రసాద్‌ను ఎంఐఎం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంఐఎం పట్టణాధ్యక్షుడు ఎండీ ముబీన్, నాయకులు నియాజొద్దీన్, ఆబీద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రెబ్బెన, అక్టోబర్ 26: రెబ్బెన మండలం కొండపల్లి గ్రామానికి చెందిన గుర్లే శాలిక్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులకు పూలే సేవా సమితి ఆధ్వర్యంలో రూ. 31862 నగదు 75 కిలోల బియ్యం అందించినట్లు పూలే సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మోర్ల తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నికోడే అర్జున్, బాపురావు, గుర్లే శ్రీనివాస్, మొర్లె పాండురంగ్, లెండుగురే తిరుపతి, వసాకే శంకర్, మాజీ సర్పంచ్ వడై శాంతపోశం, మాజీ ఎంపీటీసీ మోర్లె రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

తెప్ప బోల్తా పడి మృత్స్యకారుడి మృతి

దండేపల్లి, అక్టోబర్ 26: దండేపల్లి మండలం కన్నేపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి కిశోర్ (35) గూడెం గోదావరిలో ప్రమాదవశాత్తు తెప్ప బోల్తాపడి మృతి చెందాడు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కిశోర్ గోదావరి నదిలో చేపలు పట్టేందుకు ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా రాకపోయేసరికి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గూడెం గోదావరిలో శనివారం ఉదయం మృతదేహం తేలింది. పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

చెన్నూర్, అక్టోబర్ 26: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌ను బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే, క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను చెన్నూర్‌కు బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

మందమర్రి, అక్టోబర్ 26: క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను చెన్నూర్ మున్సిపల్‌కు బదిలీ చేశారు. రామగుండం కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న గద్దె రాజును క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

మహిళా ఉద్యోగులకు కౌన్సెలింగ్

మందమర్రి, అక్టోబర్ 26: మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో పని చేస్తున్న మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు గని కార్యాలయంలో శనివారం ఏరియా ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డాక్టర్ జయవాణి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులు ఎంచుకున్న అంశాలపై తగిన శిక్షణ ఇచ్చి, అనంతరం సంబంధిత డిజిగ్నేషన్లను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, గని మేనేజర్ రామరాజు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి కుమారస్వామి, సంక్షేమాధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేతకాని మహర్ మండల స్థాయి సమావేశం

దండేపల్లి(జన్నారం), అక్టోబర్ 26: నేతకాని కులము ఏ కులానికి ఉప కులం కాదని, ఏబీసీడీ వర్గీకరణ చేస్తే నేతకాని కులాన్ని డీ కేటగిరిలో చేర్చాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్, ఓయూ ప్రొఫెసర్ జాడి ముసలయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన నేతకాని మహర్ సంక్షేమ సంఘం మండల స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షు సాయిని ప్రసాద్, యువరాజ్, బోర్లకుంట ప్రభుదాసు, తాళ్లపెల్లి రాజేశ్వర్, జాడి గంగాధర్, రత్నం లక్ష్మణ్, స్వామి, వినోద్, మల్లయ్య, శంకర్, వసంత్, గంగాధర్, రుబెన్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రణాళిక

కాగజ్‌నగర్, అక్టోబర్ 26: కాగజ్‌నగర్ మున్సిపల్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రణాళిక జారీ చేసింది. దీంతో కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి మహర్దశ రానున్నట్లు పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

రెబ్బెన, అక్టోబర్ 26: రెబ్బెన మండలం పోతపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీ అయిన శ్రీవల్లి, దాసరి రాజును శనివారం సన్మానించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ చల్లూరి స్వరూప, కార్యదర్శి నరేశ్, హెచ్ఎంలు గోలి భాగ్య, వామన్‌రావు, రాంకిశోర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన ఏర్పాటు

కెరమెరి, అక్టోబర్ 26: అన్నార్‌పల్లి–కరంజీవాడ వాగుపై శనివారం తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు షేక్ యూనుస్, ఎజాజ్ కలిసి ప్రజలు రవాణ సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారని తెలుసుకొని తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. వారి వెంట మండల నాయకులు రాథోడ్ రమేశ్, గోవింద్‌రావు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

చెన్నూర్, అక్టోబర్ 26: లక్షెట్టిపేటలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినట్లు ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. విద్యార్థులను ఆర్సీవో గోపీచంద్ రాథోడ్, డీసీవో శ్రీధర్, ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జైపూర్, అక్టోబర్ 26: జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ఏడుగురు పారిపోయినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. రూ. 23, 270 నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బెజ్జూర్, అక్టోబర్ 26: బెజ్జూర్ మండల శివారులో పత్తి చేలల్లో పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ కాగజ్‌నగర్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. చేలల్లో పేకాట ఆడుతున్న చింతలమానెపల్లి మండలానికి చెందిన 8 మంది, కౌటాల మండలానికి చెందిన ఇద్దరు, బెజ్జూర్ మండలానికి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకొని, రూ. 5200 నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

వాంకిడి, అక్టోబర్ 26: వాంకిడి మండల ఎంపీడీవోగా ప్రవీణ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రవీణ్ కుమార్‌ను ఎంపీవో ఖాజా అజీజొద్దీన్, ఏపీవో శ్రావణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రక్తదాన శిబిరం

బెల్లంపల్లి, అక్టోబర్ 26: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని కార్యాలయం వద్ద సనాతన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా బ్లడ్ బ్యాంక్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. సీఎస్ఆర్ హెడ్ కీర్తన, కంపెనీ డైరెక్టర్ సాయినాథ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు అభినవ సంతోష్ కుమార్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ప్రణయ్, రజిత, హరీశ్, ప్రభుత్వ దవాఖాన వైద్యురాలు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

28న అభ్యంతరాల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 26: రాష్ట్రంలో స్థానిక సంస్థలకు కల్పించాల్సిన రిజర్వేషన్లపై కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను స్వీకరించడానికి ఈనెల 28న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిలాబాద్‌లోని జడ్పీ సమావేశ మందిరంలో బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను సమర్పించాలని సూచించారు.

29న జిల్లా స్థాయి పోటీలు

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 26: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈనెల 29న ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 19 జిల్లా స్థాయి నెట్ బాల్, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు డీఐఈవో కళ్యాణి, పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ చదువుతూ 19 ఏళ్ల కంటే తక్కువ వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 99493 00668 ను సంప్రదించాలని సూచించారు.

ఇసుక రవాణాకు అనుమతులివ్వాలి

- రాయల్టీ తగ్గించాలి
- ఇసుక ట్రాక్టర్ యజమానులు, భవన నిర్మాణ కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న ఇసుక ట్రాక్టర్ యజమానులు, భవన నిర్మాణ కార్మికులు

కాగజ్‌నగర్, అక్టోబర్ 26: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో ఇసుక తరలించేందుకు అనుమతులివ్వాలని, రాయల్టీ ధర ప్రభుత్వం తగ్గించాలని కోరుతూ ట్రాక్టర్ యజమానులు, భవన నిర్మాణ కార్మికులు శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయల్టీ డబ్బులు ఒక్క ట్రిప్పు ఇసుకకు రూ.1450 చెల్లించాలని ఆంక్షలు విధించడంతో గృహ నిర్మాణదారులపై భారం పడిందని, దీంతో ఇసుక రవాణా నిలిచిపోయిందని తెలిపారు. 45 రోజులుగా కూలీ పనులు లభించక చాలా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యునియన్ అధ్యక్షుడు సిద్ధిఖ్, అజం ఖాన్, నాగేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
By this deed I the under signed Kancharlawar Shrija W/o Yerrawar Vikas R/o.H.No: 1-5-81/2B, Ambedkar Nagar ,Bhainsa (Vill),Dist: Nirm al-504103,T.S. Have Changed my name to **Shrija Vikas Yerrawar W/o. Yerrawar Vikas** For all future Purposes

CHANGE OF NAME
By this deed I the under signed Kancharlawar Mamta Vijaykumar W/o Kancharlawar Jayram Siddheshwar R/o. H.No: 19/723 ,S.V.M. Colony ,VIP Road ,Kinwat,Tq Kinwat, Nanded-431804.Maharashtra,have changed my name to **Kancharlawar Mamta Jayram W/o Kancharlawar Jayram Siddheshwar** For all future Purposes.

WANTED
jobs Apply Now!
★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677